శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



# కావలిలో విజిలెన్స్ అధికారుల దాడులు

**కావలి, ఆగస్టు 9 ప్రభాతవార్త** కావలి పట్టణంలో మంగళవారం రాత్రి విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. మిర్చి ధరలు ఎక్కువుగా అమ్ముతున్నారన్న ఫిర్యాదులను పురస్కరించుకొని విజిలెన్స్ అధికారుల బృందం కావలిలో అడుగు పెట్టి పలు షాపులను తనిఖీ చేసింది. ఈ బృందంలో 9 మంది అధికారులు పాల్గొన్నట్లు వ్యాపారులు చెప్పడాన్ని బట్టి తెలుస్తుంది. కిలో మిర్చి 310 రూపాయలు అమ్ముతున్నారన్న సమాచారంతో ఈ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. చిల్లర సామాన్ల ప్యాకెట్లపై కూడా ఈ అధికారులు దాడులు చేశారు. పట్టణంలో 3,4 అంగళ్ళపై కేసులు నమోదు చేశారు. విజిలెన్స్ అధికారుల బృందం దాడులు చేస్తుందన్న సమాచారంతో మిర్చి అమ్మకాలు చేసే షాపులు కొన్ని మూసివేశారు.



# రొట్టెలపండుగ ప్రారంభం





**నెల్లూరుటౌన్.ఆగస్టు 9 ప్రభాతవార్త** దా దా ప్ర 1200 సంవత్సరాల నుంచి ఆచారంగా వస్తున్న బారా షాహీద్ దర్గా రొట్టెల పండుగా రానే వచ్చింది.ఇస్లాం మత ప్రచారం కోసం సౌదీ నుంచి,మక్కా షరీఫ్ నుంచి 12మంది తరఖామాన్ల్ అనబడే వీరులు సంచరిస్తూ భారతదేశానికి వచ్చారు.ఆసమయంలో కర్ణాటకలో హైదర్అలీ పరిపాలన ఉండేదని చరిత్ర చెబుతోంది.నెల్లూరు నగరం నవాబుల పరిపాలనలో ఉండేదని చరిత్రకారులు చెబుతుంటారు.ఖమాన్ల్ అనబడే వీరులు దేశంలో పర్యటిస్తున్నప్పుడు నెల్లూరుజిల్లా కొడవలూరు మండలం గండవరం చెరువు వద్ద వారికి,ఇస్లామేతరులకు,మధ్య యుద్ధం జరిగినట్లు చరిత్ర చెబుతోంది.ఈయుద్ధంలో తరఖ్మాన్లు ప్రాణత్యాగం చేశారు.అలా ప్రాణత్యాగం చేసిన వారిలో 12 మంది(బారాశషీద్లు)మొండాలను వారు వాహనాలుగా ఉపయోగించిన గుర్రాలు తీసుకుని వచ్చి నెల్లూరులోని దర్గామిట్ట నెల్లూరు స్వర్ణాల చెరువు వద్ద పడేశాయని చరిత్రకారులు చెబుతున్నారు.ఈమొండాలు భూమిలో కలిసి అక్కడే వారు సమాధులయ్యారు.భక్తులు ఆ ప్రదేశంలోనే వారికి సమాధులు వరుసగా నిర్మించి ఆరాధించడం మొదలు పెట్టారు.మొహరం పర్వదినాల్లో
హిందూ ముస్లింలు కలిసి నెల్లూరు స్వర్ణాల చెరువు బారా షహీద్ దర్గా వద్ద వివిధ కోర్కెలు కోరుతూ,నెరవేరిన కోర్కెల కోసం మొక్కులు తీర్చుకుంటూ రొట్టెలు ఇస్తూ పుచ్చుకుంటూ జరుపుకునే ఈపండగను రొట్టెల పండుగ అంటారు.మంగళవారం నుంచి ప్రారంభమైన రొట్టెల పండుగలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఐదు రోజుల పాటు జరిగే రొట్టెల పండుగలో పాల్గొనేందుకు దేశ నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారు.ఆర్కాటు నవాబు కోరిక నెరవేరడంతో మరుసటి ఏడాది దర్గాకు వచ్చి కృతజ్ఞత తెలియజేస్తూ,స్వర్ణల చెరువులో రొట్టె విడిచినట్లు ఒక కథనం.1930లలో ఈరొట్టెల పండుగ మొదలైందని పెద్దలు చెబుతుంటారు.
ఇళ్లలో తయారు చేసుకొచ్చిన చపాతీలు(రొట్టెలు)చెరువులోని నీళల్లో దిగి తలపై ముసుగువేసుకుని మార్పిడి చేసుకుంటారు.ఆరోగ్యం గురించి మొక్కు కొంటే ఫలితం కనిపిస్తే మరుసటి ఏడాది ఆరోగ్యం రొట్టెకావాల్సిన వారికి పంచి మొక్కు చెల్లిస్తారు.విద్యా రొట్టె,పెళ్లి రొట్టె,సౌభాగ్యరొట్టె,సంతాన రొట్టె,వీసారొట్టె,అభివృద్ధి రొట్టె ఇలా ఎన్నో రకాల రొట్టెలు ఇచ్చి పుచ్చుకోవడం నెల్లూరు బారాషాహీద్ దర్గా ఆవరణలోని చెరువు వద్ద జరుగుతోంది.మత సామరస్యానికి ప్రతీకగా ఈరొట్టెల పండుగలో రొట్టెలు మార్పిడి చేసుకొన్న భక్తులు జిల్లాలోని కసుమూరు,అనుమసముద్రం పేటలోని దర్గాలను సదర్శించి తమ భక్తి భావాన్ని చాటుకుంటారు.దర్గా కమిటీ ఆధ్వర్యంలో దర్గాలో ప్రత్యేక అలంకరలు చేసి ప్రత్యేక సుగంధాలు,వస్త్రాలు కప్పి దర్శన భాగ్యంతో పాటు,ప్రత్యేక ప్రార్థనలు చేశారు.మంగళవారంనాడు నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ రూప్కుమార్యాదవ్,రాష్ట్ర వైయస్ఆర్ కాంగ్రెస్పార్టీ కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిలు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## సమస్యలన్నీ పరిష్కరిస్తా



**చేజర్ల,ఆగస్ట్9,ప్రభాతవార్త:** సమస్యల పరిష్కారం కోసమే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చేజర్ల మండలం యనమదల సచివాలయ పరిధిలోని గ్రామాల్లో నిర్వహించిన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్ళి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకోవడంతోపాటు వారు చెప్పే సమస్యలను విని పరిష్కారం దిశగా మార్గం చూపేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కాకివాయిలోని ఇల్లిల్లు తిరిగి వృద్ధాప్య, వితంతు వికలాంగ పెన్షన్లు వస్తున్నాయా లేదా , అర్హులకు అమ్మఒడి , జగనన్న విద్యాదీవెన లాంటి పథకాలు అందుతున్నాయా లేదా అన్న విషయాలను గ్రామాల్లో అడిగి తెలుసుకున్నారు. మంగళ, బుధవారాల్లో గ్రామాల్లో తిరిగి సమస్యలను గుర్తించి బుధవారం సాయంత్రం సచివాలయంలో సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించడంతోపాటు సంబంధిత శాఖలకు అర్జీలను అందజేసి పరిష్కారమార్గం చూపాల్సిందిగా తెలియజేస్తామన్నారు. మంగళవారం పబ్లిక్ హాలిడే కావడంతో సెలవురోజు ప్రభుత్వ కార్యక్రమమా అంటూ కొంతమంది అధికారులు అసహనం వ్యక్తం చేశారు. మండల కన్వీనర్ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, ఎంపిపి బాలిరెడ్డి రమాదేవి , ఎమ్మెల్యే , అధికారులు గ్రూపులుగా ఏర్పడి గ్రామాల్లోని అన్ని ఇళ్ళను సందర్శించి సమస్యలను గుర్తించారు. ఈకార్యక్రమంలో మండలంలోని వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## సంగం బ్యారేజిని సందర్శించిన చీఫ్ ఇంజనీర్

**సంగం ఆగష్టు 9 ప్రభాతవార్త**



సంగం బ్యారేజి వద్ద జరుగుతున్న పనులను చీఫ్ ఇంజనీరు హరినారాయణరెడ్డి పరిశీలించారు.బ్యారేజి వద్ద జరుగుతున్న పనులపై అధికారులతో ఆయన చర్చించారు. ఆగష్టు మూడోవారం నాటికి బా ్యరేజి పనులు చేసి ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పోతిరెడ్డిపాడు నుండి సోమశిలకు 20 వేల క్యూసిక్కుల నీటిని తీసుకుంటున్నట్లు తెలిపారు.ఇప్పటికే సోమశిలలో 66 టిఎంసిలు ఉన్నట్లు చెప్పారు.సోమశిల నుండి కండలేరుకు ప్రతి రోజు ఒక టిఎంసి చొప్పున నెలరోజులుపాటు తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో నెల్లూరు,చిత్తూరు జిల్లాలకు సుమారు 9 లక్షల ఎకరాలకు పుష్కలంగా సాగునీరు అందిస్తున్నట్లు ఆయన పేర్కున్నారు.

# గిరిజనుల సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి





**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 9 ప్రభాతవార్త** గిరిజనుల సంక్షేమానికై అనేక కార్యక్రమాలను అమలుచేస్తూ వారి సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్‌ప్రాసెసింగ్‌శాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం జిల్లా సమీకృత గిరిజనాభివృద్ధిసంస్థ (ఐటిడిఏ) నెల్లూరులోని శ్రీవెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ముందుగా గిరిజనుల అభివృద్ధి సంక్షేమాలకు పాటుబడ్డ డాక్టర్ బీఆర్అంబేద్కర్-వెన్నెలకంటి రాఘవయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన కాకాణి ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాలు ముఖ్యంగా గిరిజనుల అభ్యున్నతికి కృషిచేసిన డాక్టర్ బీఆర్అంబేద్కర్, వెన్నెలకంటి రాఘవయయ వంటి ఎంతోమంది మహనీయులని స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. జిల్లా జనాభా 26 లక్షలుకాగా అందులో 9 శాతం గిరిజనులు వుండగా వారిలో అక్షరాస్యతా శాతం 40 లోపే వుండడం బాధాకరమన్న మంత్రి విద్యతోనే గిరిజనుల అభ్యున్నతి సాధ్యపడుతుందన్నారు. జిల్లాలో గిరిజనుల విద్య కోసం అనేక గురుకులాలు, ఆశ్రమపాఠశాలలు నడుపబడుతున్నాయన్న గిరిజనులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గిరిజనుల పిల్లలు నైపుణ్యంతో ఎవరికీ తీసిపోరన్న ఆయన గిరిజన పిల్లల్లోని సృజనాత్మకతను గుర్తించి సరైన శిక్షణ ఇస్తే వారు ఉన్నతస్థానాలకు చేరుకుంటారన్నారు. సమాజంలో మాకు ఇది కావాలని గట్టిగా అడగలేని వర్గం ఏదైనా వుంటే అది యానాది వర్గమేనన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆ వర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ముందుకురావాలన్నారు. గిరిజన వర్గానికి చెందిన వారికి ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వడంతోపాటు గిరిజన మహిళ రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపతి ముర్ముకు బేషరతుగా మద్దతు తెలిపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డికి దక్కుతుందన్న ఆయన గిరిజనుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలుచేస్తూ వారికి అండగా నిలుస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కోవిడ్ సమయంలో సర్వేపల్లి నియోజకవర్గంలో చాలామంది గిరిజనులకు ఆధార్‌కార్డులు లేని విషయాన్ని గుర్తించి ప్రతి గిరిజన కాలనీలో మొబైల్‌ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటుచేశామన్న మంత్రి అదేవిధంగా నియోజకవర్గంలో 2700 గిరిజన కుటుంబాలకు ప్రభుత్వపరంగా ఇళ్ళు మంజూరు చేయించామన్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే నిధులకు అదనంగా మరో రూ. 15 వేల రూపాయలు పరిశ్రమల ప్రతినిధుల నుండి సీఎస్‌ఆర్ నిధుల ద్వారా ఇప్పించామన్నారు. జిల్లావ్యాప్తంగా గిరిజనుల ఇండ్ల నిర్మాణాలకు ఇదే విధంగా ఇప్పించే ఏర్పాట్లు చేస్తామని కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

**ప్రభుత్వ పథకాల సద్వినియోగం : మేయర్ స్రవంతి**

నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజనాభివృద్ధికి అనేక కార్యక్రమాలను అమలుచేయడం జరుగుతోందన్నారు. సమాజంలో గిరిజనులకు ఆర్థికాభివృద్ధి సాధించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాల్సి వుందన్నారు. చాలామంది గిరిజనులు అవగాహన లేక..చిన్న చిన్న కారణాలతో..ఆధార్‌కార్డులు లేక ఆయా పథకాలను పొందలేకపోతున్నారన్నారు. ఈ సందర్భంగా ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి మందరాణి జిల్లా సమీకృత గిరిజనాభివృద్ధిసంస్థ ద్వారా గిరిజనుల అభివృద్ధి-సంక్షేమాలకు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం స్వాతంత్ర సమరయోధులయిన కేవీచలమయ్య దంపతులను మరో స్వాతంత్ర సమరయోధులు చల్లా గుర్నాథం తరపున వారి కుటుంబసభ్యులు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, అధికారులు ఘనంగా సత్కరించారు.

**థింసా నృత్యంలో పాల్గొన్న మేయర్, అధికారులు**

కాగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకొని వివిధ గురుకుల, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. ఇందులో భాగంగా నిర్వహించిన థింసా నృత్యంలో నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి, జిల్లా పంచాయితీ అధికారి ధనలక్ష్మి, జిల్లాపరిషత్ సీఈఓ వాణి, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరక్టర్ రమాదేవి, సమగ్ర శిక్ష ఏపీడీ ఉషారాణి తదితరులు పాల్గొనడం గమనార్హం. కాగా ఈ కార్యక్రమంలో జిల్లాపరిషత్ సీఈఓ ఆనం అరుణమ్మ, జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, సెట్నెల్ సీఈఓ పుల్లయ్య, ఐటిడిఏ పీఓ మందరాణి, జెడ్పీ సీఈఓ వాణి, డిపిఓ ధనలక్ష్మి, సమగ్రశిక్ష ఏపీడీ పద్మ, ఐసీడీఎస్ పీడీ ఉమామహేశ్వరి, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరక్టర్ రమాదేవి, గిరిజన సంక్షేమాధికారి పరిమళ, బీసీ సంక్షేమశాఖాధికారి వెంకటయ్య, ఏపిఎంఐపీ పీడీ శ్రీనివాసరెడ్డి, మైనారిటీ సంక్షేమశాఖాధికారి కనకదుర్గాభవానితోపాటు వివిధ గిరిజన సంఘాల నాయకులైన కేసీ పెంచలయ్య, రామచంద్రయ్య, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, సంజీవయ్య పాల్గొన్నారు.

## మర్రిపాడు హైస్కూల్లో నిప్పంటించిన అపరిచితులు

**మర్రిపాడు, ఆగస్ట్9, ప్రభాతవార్త:** మర్రిపాడు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో మంగళవారం స్టాఫ్‌రూమ్‌లో ఎవరో అపరిచితులు నిప్పంటించడంతో అందులో ఉన్న బూట్లు పలురకాల విద్యాసామాగ్రి కాలి బూడిదయ్యాయి. హెచ్‌ఎం శివజ్యోతి ఆమె మాట్లాడుతూ హైస్కూల్లో క్రీడా మైదానం ఉండడంతో ఆడుకునేందుకు క్రీడాకారులు వస్తున్నారులే అని భావిస్తే ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు లోపలకు ప్రవేశించి ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడం సమంజసం కాదని ఆమె మండిపడ్డారు. గతంలో కూడా తాగునీటి బోరుకు సంబంధించిన స్టార్టర్‌ను కూడా పగులగొట్టిపోయారని ఆమె ఆరోపించారు. స్కూల్ ముగిసిన తర్వాత సెలవురోజుల్లో కూడా ఎవరు లోపలికి రావద్దని అలా వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈవిషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఆమె హెచ్చరించారు.

## జాతీయ పక్షిని కాపాడిన రామచంద్రాపురం యువత

**కోవూరు, ఆగస్టు 9 ప్రభాతవార్త :**



ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా కార్యక్రమాలు జోరుగా జరుగుతున్న వేళ మంగళవారం జాతీయ పక్షి నెమలిని కోవూరు మండలం గంగవరం గ్రామంలోని రామచంద్రాపురం ప్రాంతానికి చెందిన యువత కాపాడి ఆ విషయాన్ని గ్రామ సర్పంచ్ లక్ష్మీకుమారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆమె ఈ విషయాన్ని సుభాష్ సేవా సంఘం అధ్యక్షులు సురేష్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా ఆ విషయాన్ని ఆయన ఆత్మకూరు అటవీ రేంజ్ ఆఫీసర్ పిచ్చిరెడ్డికి సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఆయన సిబ్బందితో హుటాహుటిన రామచంద్రాపురం గ్రామానికి వచ్చి నెమలిని తమ సంరక్షణలోకి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నెమలిని కాపాడిన రామచంద్రాపురం యువతను, గ్రామ సర్పంచ్ లక్ష్మీకుమారిని , సుభాష్ సేవా సంఘం అధ్యక్షులు సురేష్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు.

# జిల్లా కీర్తి ప్రతిష్టలు పెరిగేలా రొట్టెల పండుగ

**నెల్లూరుటౌన్,ఆగస్టు 9 ప్రభాతవార్త** నెల్లూరుజిల్లా కీర్తి ప్రతిష్టలు పెరిగేలా బారా షాహిద్ దర్గా రొట్టెల పండుగ వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన చర్యలతో పాటు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టామని రాష్ట్ర వ్యవసాయ,సహకార,మార్కెటింగ్,ఫుడ్ ప్రాసెసింగ్ శాఖామాత్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు.మంగళవారం నెల్లూరు నగరంలోని బారాషహీద్ రొట్టెల పండుగ ఏర్పాట్లపై నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ఇన్చార్జ్ కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి,జిల్లా ఎస్పీ విజయారావుతో కలిసి సమీక్ష జరిపారు.ఈసంధర్భంగా మంత్రి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ అన్నీ మతాలకు,కులాలకు అతీతంగా జరుగుతున్న రొట్టెల పండుగకు ముందస్తుగానే జనం తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం బారా షాహీద్ దర్గా అభివృద్ధికి రూ.15కోట్ల రూపాయాల



నిధులను మంజూరు చేసిందన్నారు.అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మంత్రి ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు.బారా షాహిద్ దర్ధాగలో మసీదు నిర్మాణానికి రూ.7.5కోట్ల రూపాయాలతో దర్గా ఆవరణలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి,దర్గా అబివృద్ధికి మరో 7.5కోట్ల రూపాయాల మొత్తం 15కోట్ల రూపాయాలు మంజూరు చేయడం జరిగిందన్నారు.
2023న జరిగే రొట్టెల పండుగ నాటికి ఈనిర్మాణాలు పూర్తి చేసేలా చేయడం జరుగుతుందన్నారు.అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రసాదం స్కీమ్ కింద శ్రీవేదగిరి నరసింహాస్వామి వారి దేవాలయాన్ని అభివృద్ధి చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున 50కోట్ల రూపాయాలతో ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు.ఈపనులు పూర్తయితే పుణ్యక్షేత్రాలుగా రెండు ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు.ఈసంధర్భంగా మంత్రి దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.గోవర్ధన్‌రెడ్డి వెంట జిల్లా కలెక్టర్ కెవిఎన్.చక్రధర్‌బాబు,నగర మేయర్ పొట్లూరి స్రవంతి,ఎస్‌పి.విజయరావు,జాయింట్ కలెక్టర్ కూర్మనాధ్,నగరపాలక సంస్థ కమిషనర్ హరిత,నెల్లూరు ఆర్‌డిఓ మాలోల,జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిణి కనకదుర్గా భవాని,స్థానక కార్పోరేటర్ వాసంతి,నిర్వాహక కమిటీ ఛైర్మన్ షాజహాన్,వైస్ ఛైర్మన్ ఖాధర్‌భాషా,నెల్లూరురూరల్ తహసీల్ధార్ వెంకటేశ్వరరావు,వివిధశాఖల అధికారులు పాల్గోన్నారు.

## రొట్టెల పండుగ ఏర్పాట్లను పర్యవేక్షించిన మేయర్



**నెల్లూరు కార్పొరేషన్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** బారాషాహీద్ దర్గా రొట్టెల పండుగ ఏర్పాట్లను మంగళవారం మేయర్ స్రవంతి పరిశీలించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులను ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, అందుకు అవసరమైన చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని మేయర్ స్రవంతి అధికారులను ఆదేశించారు.

## జాతిపిత గాంధీ మహాత్మునికి పాలాభిషేకం



**బుచ్చి ఆగష్టు 9 ప్రభాతవార్త:** అజాదికా అమృత మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా బిజెపి నగరశాఖ ఆద్వర్యంలో జాతిపిత మహాత్మగాంధీ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. స్వాతంత్ర సమరయోదులకు బిజెపి కార్యకర్తలు,నాయకులు నివాళులర్పించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగి విచ్చేసిన బిజెపి నేతల మిడతల రమేష్ మాట్లాడుతు 75 సంవత్సరాల స్వాతంత్ర ఫలాలు స్పూర్తిదాయకం కావడం కోసం ఆజాదికా అమృత మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఇంటింటిపైన జాతీయ పతకాం ఎగరవేసి కార్యక్రమాన్ని భారత ప్రభుత్వం రూపకల్పన చేసిందని ఆయన తెలిపారు. దేశమంటే మట్టికాదోయ్–దేశమంటే మనుషులోయే అనే సందేశాన్ని నేటి యువతరానికి అందించడం కోసం ఇంటిపై జాతీయ పతాకం ఎగురవేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపకల్పన చేసిందని చెప్పారు.1857 నుండి1947 వరకు 90 సంత్సరాలు వ్యవధిలో లక్షలాదిమంది బలిదానం పుణ్యమే స్వాతంత్రం సిద్దించిందని తెలిపారు. కన్నతల్లిని ఏవిధంగా గౌరవిస్తామో ఆవిధంగా ఈ దేశాన్ని తల్లిగా గౌరవించడం కోసం ప్రతి ఇంటిపైన జాతీయ జెండా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో బిజెపి నగర అద్యక్షులు రామిశెట్టి మోహన్‌బాబు, బిజెపి జిల్లా ప్రధానకార్యదర్శి గడ్డం విజయ్‌కుమార్, బిజెపి జిల్లా కార్యదర్శి కాసా శ్రీనివాసులు, యువమోర్చ జిల్లా అద్యక్షుడు యశ్వంత్‌సింగ్,దళిత మోర్చ జిల్లా ఉపాద్యాక్షులు యశ్వంత్‌సింగ్,దళితమోర్చ జిల్లా ఉపాధ్యాక్షులు గొల్ల నరసింహులు,బిజెవైఎం నాయకులు గోలి సురేంద్ర, కోణం శ్రీనివాసులు, ఎస్‌సి మోర్చ మున్సిపాల్టీ అద్యక్షులు తిరపతయ్య, చేనేత నాయకులు కుటుంబాల శ్రీనివాసులు, దోనిపర్తి వెంకటరమణయ్య, మునగపాటి లక్ష్మయ్య, వర్ది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## రొట్టెల పండుగలో రెడ్‌క్రాస్ సేవలు




**నెల్లూరు కార్పొరేషన్, ఆగస్టు 9,** ప్రభాతవార్త: నెల్లూరు జిల్లా శాఖ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో 100 మంది వలంటీర్లతో మంగళవారం దర్గా ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం, అంబులెన్స్ సేవలు, అత్యవసర పరిస్థితులలో ఉపయోగపడే వలంటీరు సేవలను నెల్లూరు నగర మేయర్ స్రవంతి జయవర్ధన్, కోశాధికారి సురేష్‌కుమార్ జైన్‌లు మంగళవారం ప్రారంభించారు. ఎఆర్ డిఎస్‌పి మహాత్మాగాంధీ వైద్య శిబిరాన్ని దర్శించి బారాషహీద్, దర్గా రొట్టెల పండుగ సందర్భంగా దేశం నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులకు ఎలాంటి అనారోగ్యం కలగకుండా ఉండేందుకు ప్రథమ చికిత్స అందిస్తూ, ఉచితంగా మందులు అందజేయడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఈ రెడ్‌క్రాస్ వైద్య శిబిరంలో మేయర్ బిపి పరీక్షలు చేసుకొని, వచ్చిన భక్తులకు అందజేస్తున్న ప్రథమ చికిత్సను పరిశీలించి ఆమె అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు డి.రాజేంద్రప్రసాద్, వై.సురేష్, కన్వీనర్లు డా. టి.శ్రీరంజని, టి.భాస్కర్‌రెడ్డి, సి.హెచ్.అజయ్‌బాబు, మురళీకృష్ణ, డాక్టర్ ఉదయ్‌శంకర్, పిఎంపి ఆర్‌ఎంపి నాయకులు ఎ.వి.రమణయ్య, శాఖవరపు వేణుగోపాల్, కె.రవీంద్రబాబు, ం రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ జి.వి.రవికుమార్, వంద మంది వలంటీర్లు పాల్గొన్నారు.

## గిరిజనులకు రుచికరమైన భోజనం అందచేసిన డానియేల్

**కావలి, ఆగస్టు 9 ప్రభాతవార్త:** నెల్లూరు పట్టణ సచివాలయంలో వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న పి.జస్వంత్ డానేయేల్ ఉద్యోగం పర్మినెంట్ అయిన సందర్భంగా కావలి పట్టణ పరిసర ప్రాంతాల్లోని గిరిజనులకు చికెన్ బిర్యానీ, పండ్లు, వడ, గుడ్డు, కూల్‌డ్రింక్స్‌తో రుచికరమైన భోజనాన్ని అందజేశారు. కావలి సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం చెంచుగానిపాళెం గిరిజనులకు ఈ భోజన సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా దాత జస్వంత్ డానేయేల్‌కు అభినందనలు తెలిపారు.

## విద్యతోనే ఆదివాసుల అభివృద్ధి




**వింజమూరు, ఆగస్ట్9, ప్రభాతవార్త:** విద్యతోనే ఆదివాసులు సర్వతోముఖాభివృద్ధి సాధ్యపడుతుందని ప్రతి ఒక్కరూ చదివి ఉన్నతస్థితికి చేరుకోవాలని ప్రధానమంత్రి నూతన 15సూత్రల కమిటీ సభ్యులు డాక్టర్ ఎలీషాకుమార్ పేర్కొన్నారు. మంగళవారం వింజమూరు పంచాయతీ పరిధిలోని జిబికెఆర్ ఎస్టీకాలనీలో అఖిలభారత ఆదివాసి ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆదివాసుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికీ ఆదివాసులు ప్రభుత్వ పథకాలకు , విద్యకు దూరంగా ఉంటూ కొండప్రాంతాల్లో జీవిస్తుండడం బాధాకరమన్నారు. స్వతంత్రం వచ్చి 75సంవత్సరాలైనప్పటికీ వారి జీవన స్థితి గతులు ఏమాత్రం మెరుగుపడలేదన్నారు. ఇప్పుడిప్పుడే అడవులను వదిలి విద్యవైపు మొగ్గుచూపుతూ కొంతమంది ఆదివాసులను అభివృద్ధిపథంలో నడిపేందుకు సంఘాలుగా ఏర్పడి కృషి చేయడం అభినందనీయమన్నారు .ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. మూఢనమ్మకాలను విడనాడి సమాజంలో తాము ఒకరుగా ఉండాలన్నారు. తాను కూడా 15ఏళ్ళపాటు గిరిజనులతో కలసి ఎన్నో పోరాటాలు చేసి వారి హక్కుల సాధనకు కృషి చేశానన్నారు. అఖిలభారత ఉద్యోగుల సంఘ నాయకులు,సభ్యులు కూడా నిరంతరం గ్రామాల్లో పర్యటిస్తూ వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. అనంతరం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పెంచలపుల్లయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఆదివాసులను చైతన్యవంతం చేసి వారికి అందాల్సిన అన్ని సౌకర్యాలు అందేలా కృషి చేయడం, వారిలో విద్య, వైద్యం , ఉపాది అందేలా సహాయ సహకారాలు తమ సంఘం తరపున అందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా అఖిలభారత ఆదివాసుల ఉద్యోగ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉయ్యాల శ్రీనివాసులు, ఎంపిటిసి సభ్యురాలు యాకసిరి భవాని, పిసిసి ప్రధాన కార్యదర్శి మద్దూరు రాజగోపాల్‌రెడ్డి, సిపిఎం సీనియర్ నాయకులు బయన్న, కాలనీవాసులు పాల్గొన్నారు

## కలివెల సేవలు ప్రశంసనీయం




**వింజమూరు, ఆగస్ట్9, ప్రభాతవార్త:** విద్యార్థి దశనుండే సామాజిక అసమానతలపై రాజీలేని నిరంతర పోరాటాలు సాగిస్తున్న డాక్టర్ కలివెల ఎలీషాకుమార్ సేవలు ప్రస్తుత సమాజానికి ఎంతో దోహదపడతాయని పాస్టర్ ఫెలోషిప్ ప్రతినిధులు ప్రశంసించారు. మైనార్టీల (క్రిస్టియన్,ముస్లిం)సంక్షేమానికి ప్రధానమంత్రి 15సూత్రాల అమలు నెల్లూరు జిల్లా కమిటీ సభ్యులుగా నియమితులైన కలివెల ఎలీషాకుమార్‌కు మంగళవారం వింజమూరులోని ఇన్‌ఫాంట్ జీసెస్ ఇంగ్లీష్‌మీడియం స్కూల్లో ఘన సన్మానసభను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ మెట్టప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలోని సీతారామపురం మండలంలో ఓమారుమూల ప్రాంతంలో జన్మించిన ఎలీషాకుమార్ సమసమాజ హితం కోసం పరితపిస్తున్న వైనం అనిర్వచనీయమన్నారు. ఎలీషాకుమార్ ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాల ఆర్‌సిఎం, బిషప్ కౌన్సిల్ కార్యదర్శిగాను , ఎఐసిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులుగాను అకుంఠిత దీక్షతో విధులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందేనన్నారు. పట్టుదల, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన ఎలీషాకుమార్ అందరికి ఆదర్శప్రాయుడని కొనియాడారు. ఈకార్యక్రమంలో నెల్లూరుజిల్లా 'పీస్' కమిటీ సభ్యులు ఎఐసిఎఫ్ అధ్యక్షులు రాయపాటి హృదయ్‌కుమార్, ఎఐసిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.విజయకుమార్, వింజమూరు, కలిగిరి, దుత్తలూరు మండలాలకు చెందిన పాస్టర్లు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ హయాంలోనే దంపూరు గ్రామం అభివృద్ధి



**విడవలూరు ఆగష్టు 9 ప్రభాతవార్త:** దంపూరు గ్రామంలో అభివృద్ధి జరిగిందంటే దివంగతనేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నసమయంలో మాత్రమేనని అన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో దంపూరు గ్రామంలో చేసిన అభివృద్ధి ఏమిలేదని గ్రామ సర్పంచ్ సురేంద్రరెడ్డి విమర్శించారు. విడవలూరు మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతు గ్రామంలో బాబా దేవస్ధానికి ఒక్కసారి జరిగే అన్నదాన కార్యక్రమానికి మూడువందల అరవై రోజులు త్రాగునీరు అందించే వాటర్‌ప్లాంట్‌కి ఎటువంటి సంబంధం లేదని,ఆలయం పేరు చెప్పి వాటర్ ప్లాంట్ నిర్మాణాన్ని ఆదుకునే ప్రయత్నం చేసి మేము అడ్డుకోలేదనడం హాస్యస్పదంగా ఉందని అన్నారు.గ్రామంలో టిడిపి నాయకుడు సమీప బందువు ఆక్రమించుకున్న పది ఎకరాల పొలాన్ని త్వరలో స్వాధీనం చేసుకోవడం కోసం పోరాటం చేస్తామని అన్నారు. వాటర్‌ప్లాంట్ నిర్మాణం ఆపాలంటు మండల అధికారులకు పిర్యాదు ఇచ్చి అబివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేసింది మీరు కాదా అని వారు ప్రశ్నించారు.ఈ సమావేశంలో స్ధానిక నాయకులు వెంకటేశ్వర్లు,కాంట్రాక్టర్ వెంకయ్య, శ్రీనివాసరావు,నారాయణ తదితరులు పాల్గోన్నారు.

## ముగిసిన ఎమ్మార్పీఎస్ నిరసన దీక్షలు




**వింజమూరు, ఆగస్ట్9, ప్రభాతవార్త:** వింజమూరు తహసిల్దార్ కార్యాలయం ఎదుట ఎస్సీ వర్గీకరణ కొరకు ఎంఎస్‌పి, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు 8వ రోజు మంగళవారంతో ముగిశాయి. మంగళవారం జరిగిన నిరసన దీక్షలో దుత్తలూరు మండల ఎంఎస్‌పి నాయకులు యద్దనపూడి రమణయ్య మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈకార్యక్రమంలో ఎంఎస్‌పి జిల్లా నాయకులు పందిటి అంబేద్కర్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో మాదిగలను మోసం చేస్తున్న బిజెపి ప్రభుత్వంపై వరుసగా నిరసన దీక్షలను 7రోజులుగా కొనసాగించామని , వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు పార్లమెంట్ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడడంతో దీక్షలను విరమించామన్నారు. తమ అంతిమ లక్ష్యం వర్గీకరణ సాధనే అన్నారు. ఈకార్యక్రమంలో పి.కొండయ్య, కె.రాజా, రాఘవేంద్ర, ఎం.రామకృష్ణ, ఎం.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రొట్టెలపండగకు పోటెత్తిన భక్తులు

















## బోగోలులో నలుగురు వ్యవసాయ శాఖ సహాయకులు సస్పెన్షన్

**బిట్రగుంట, ఆగస్టు 9 ప్రభాతవార్త:** బోగోలు మండలంలో ఈక్రాప్ నమోదు ప్రక్రియలో అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలపై ఉన్నతాధికారుల విచారణలో స్పష్టమైనందున నలుగురు గ్రామ వ్యవసాయ సహాయకులను జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని మండల వ్యవసాయాధికారిణి ఎస్.విజయలక్ష్మి తెలిపారు. సస్పెన్షన్లకు గురైన వారిలో జువ్వలదిన్నె సచివాలయానికి చెందిన భానుప్రకాష్, కోవూరుపల్లి సచివాలయానికి చెందిన భానుప్రకాష్,బోగోలు 3 సచివాలయానికి చెందిన నందిని, తాళ్ళూరు సచివాలయానికి చెందిన దంతేశ్వరిలు వున్నట్లు ఆమె పేర్కొన్నారు.

## బోగోలులో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



**బిట్రగుంట, ఆగస్టు 9 ప్రభాతవార్త:** బోగోలు పంచాయతీ పరిధిలోని రామాపురంలో మంగళవారం ప్రపంచ ఆదివాసీ దినోత్స వాన్ని ఎరుకుల సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు.రామాపురంలోని ఎరుకుల కులానికి ఆదర్శ పురుషుడైన ఏకలవ్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రామాపురం నుండి బోగోలు బజారు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికీ సంచార జాతులైన ఎరుకుల కులస్తులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా అన్యాయం చేస్తున్నాయన్నారు. సమాజంలో మైనార్టీలైనందున మెజార్టీ ఓట్ల కోసం ప్రజాప్రతినిధులు సైతం ఎరుకుల కుల హక్కులను హరిస్తూ నకిలీ గిరిజనులకే వత్తాసు పలుకుతున్నారన్నారు. తమ కులానికి న్యాయం జరిగేంత వరకు న్యాయ పోరాటం చేస్తామని అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయించి తమ హక్కులు సాధిస్తామని వారు ఈ సందర్భంగా ప్రతినబూనారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా ఎరుకుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ఇట్టా వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి కావాటి శ్రీనివాసులు, గిరిజన సంఘాల జెఏసి రాష్ట్ర ఉపాధ్యక్షులు సముద్రాల దావీదు, జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్, జిల్లా ఎస్టీ లీగల్ సెల్ అడ్వయిజర్ గుర్రంకొండ సర్దార్, జిల్లా బిజెపి ఎస్టీ సెల్ నాయకులు సముద్రాల వెంకటేశ్వర్లు, గిరిజన నాయకులు బోగిరి యోహాన్, దేవరకొండ భాస్కర్‌రావు, బోగిరి ప్రభాకర్, ఆవుల సురేష్, ఆవుల వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆలయ పరిసరాలు శుభ్రం



**కావలి రూరల్, ఆగస్టు 9 ప్రభాతవార్త:** కావలి పట్టణ 23వ వార్డులో మంగళవారం పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిజెపి రాష్ట్ర ఓబిసి ఉపాధ్యక్షులు పసుపులేటి సుధాకర్ సహకారంతో సాయిబాబా ఆలయ ఆవరణం, పరిసర ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాలు జెసిబితో తొలగించారు. సాయిబాబా ఆలయానికి వెళ్లాలంటే పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాలతో భక్తులు ఎంతో అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమస్యను తెలుసుకున్న పసుపులేటి పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాలను తొలగింపజేయించారు. ఈ సందర్భంగా భక్తులు, స్థానికులు పసుపులేటికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఈ మూడేళ్ళలో కావలి పట్టణంలో అభివృద్ధి శూన్యం




**కావలి, ఆగస్టు 9 ప్రభాతవార్త:** వైసిపి మూడేళ్ల పాలనలో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి పర్యవేక్షణలో కావలి పట్టణంలో అభివృద్ధి చేసిన పాపాన పోలేదని, తట్ట మట్టి వేసిన దాఖలాలు లేవని జనసేన పార్టీ నేతలు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కావలి పట్టణం రైల్వే రోడ్డులోని జర్నలిస్ట్ క్లబ్‌లో జనసేన పార్టీ నేతలు మంగళవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సమ్మన వెంకట సుబ్బయ్య, కావలి నియోజకవర్గ అధికార ప్రతినిధి మన్నేపల్లి రుషికేష్, గౌరవ సలహాదారుడు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు పొబ్బా సాయివిఠల్‌లు మాట్లాడారు. కావలి పట్టణంలో రోడ్లు, డ్రైనేజిలు అస్తవ్యస్తంగా మారినా పట్టించుకునే నాధుడే కరవయ్యాడన్నారు. కావలి పెద్దపవని రోడ్డు బ్రిడ్జి పూర్తి చేయాలని తెలుగుదేశం పాలనలో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఆనాడు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నానా యాగి చేశారన్నారు. విమర్శలు గుప్పించారన్నారు. రాష్ట్రంలో వైసిపి పాలన వస్తే ఆఘమేఘాలపై బ్రిడ్జిని పూర్తి చేస్తామని ఆయన హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అధికారం వచ్చి మూడేళ్ళు నిండినా ఎమ్మెల్యే బ్రిడ్జిని ఎందుకు పూర్తి చేయలేదని వారు ప్రశ్నించారు. సినిమా హాలు రోడ్డులో ఎమ్మెల్యే వేసిన బ్రిడ్జి శంఖుస్థాపన శిలాఫలకానికి జనసేన పార్టీ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేసి నిరసనలు వ్యక్తం చేయడం జరిగిందన్నారు. ఇదిలావుంటే గడిచిన రెండు సంవత్సరాలలో వైసిపి నేతల రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం గ్రావెల్‌తో టిప్పర్లను రాత్రిబంవళ్ళు తిప్పి తుమ్మలపెంట రోడ్డును గుంతలమయం చేసి అస్తవ్యస్తంగా తయారు చేసిన ఘనత ప్రతాప్‌రెడ్డికే దక్కిందన్నారు. అలాగే ఉదయగిరి బ్రిడ్జిపై మరమ్మతులు చేస్తానని ఎమ్మెల్యే అధికారులతో, నాయకులతో అటుఇటు కవాతు చేశారని ఎద్దేవ చేశారు. ఆయన హామీ ఇచ్చి రెండు నెలలు కావస్తున్నా నేటికి కార్యరూపం దాల్చలేదన్నారు. అపరిశుభ్రతకు కావలి లోగిలిగా మార్చి చెత్త పన్ను కట్టమని వత్తిళ్లు చేయడం దుర్మార్గమన్నారు. కావలి ఎమ్మెల్యే ఇంటికి ఎదురుగా వున్న మందాటి చెరువు విస్తీర్ణం 114 ఎకరాలు వున్నట్లు రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయన్నారు. ప్రస్తుతం 50 ఎకరాలు కూడా లేదన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, ఇప్పుడు వైసిపి నాయకులు ఆక్రమణలకు పాల్పడ్డారన్నారు. వైసిపి పాలనలో ఈ చెరువును యథేచ్ఛగా కబ్జా చేస్తుంటే అధికారులు ప్రేక్షక పాత్ర పోషించడం ఏమిటని ప్రశ్నించారు. ఏ మాత్రం రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులకు చిత్తశుద్ధి, నిజాయితీ వుంటే ఈ మందాటి చెరువు 114 ఎకరాల్ని రక్షించాలని డిమాండ్ చేశారు. కబ్జాదారుల కోరల్లో వున్న చెరువు భూముల్ని బయటకు తీయాలన్నారు. ఆఖరికి కోర్టులలో వున్న షాపులను సైతం వైసిపి పాలనలో ఖాళీ చేయించి ధ్వంసం చేస్తున్నారన్నారు. పోలీస్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కావలి పట్టణంలో ప్రభుత్వ భూముల్ని, కాలువల్ని, గుంతల్ని దర్జాగా కబ్జా చేస్తుంటే ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. కోట్లాది రూపాయలతో అక్రమ గ్రావెల్ సంపాదనలో వైసిపి నేతలు మునిగి తేలుతున్నారన్నారు. కావలి పట్టణంలో పూర్తి స్థాయిలో జనసేన కమిటీ ఏర్పాటు చేసి వైసిపి అవినీతి పాలనపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ప్రజాసేవ కోసం కోట్లాది రూపాయల సంపాదన వదులుకొని రాజకీయాల్లోకి వచ్చి తన డబ్బు సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తున్న పవన్‌కళ్యాణ్‌కు రానున్న ఎన్నికలలో ఓట్లు వేసి ముఖ్యమంత్రిగా గద్దెనెక్కించాలని వారు కోరారు. మంత్రి రోజాకు పవన్‌కళ్యాణ్‌ను విమర్శించే స్థాయి లేదని తెలిపారు.ఈ సమావేశంలో మండల జనసేన నాయకులు ఫణికుమార్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మునికి పాలాభిషేకం

**కోవూరు, ఆగస్టు 9 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీపార్కు సెంటర్‌లో ఉన్న మహాత్ముని విగ్రహానికి ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బీజేపీ నేతలు ఆ మహనీయుని విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రధానమంత్రి మోడీ ఆధ్వర్యంలో 75 వారాల పాటు ఈ కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగుతున్నాయన్నారు. స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపిరి తెచ్చిన మహనీయులను నేటి యువత స్మరించుకుని వారి అడుగుజాడల్లో పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రఘురామయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయలక్ష్మి, నేతలు పెంచల్‌రెడ్డి, సురేష్, తదితరులు ఉన్నారు.

## నేరప్రవత్తి గల నాయకులపై చర్యలు

**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 9 ప్రభాతవార్త:** నేరప్రవత్తి గల నైతిక విలువలు లేని గోరంట్ల మాధవ్ వంటి రాజకీయ నాయకులను చట్టసభలో నిరోధించాలని..బహిష్కరించాలని సామాజిక ఉద్యమ కార్యకర్త డాక్టర్ వసుంధర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోరంట్ల మాధవ్ నగ్న వీడియో సంచలనం కలిగించిందన్న ఆమె సంఘటన వెలుగులోకి వచ్చి ఐదురోజులు దాటుతున్నా ఇంతవరకు ఆయనపై కనీస చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. నిజనిర్ధారణ అయ్యేవరకైనా ఆయన్ని దూరం పెట్టాల్సి వుందని పుచ్చలపల్లి సుందరయ్య, నీలం సంజీవరెడ్డి, వాజ్‌పేయ్, అద్వానీ వంటివారు కూర్చున్న పార్లమెంట్‌లో మాధవ్ ఇంకనూ కొనసాగుతుండడం దారుణమన్నారు. రాజకీయ పార్టీలు ఇకనైనా మానవీయ విలువలన కొంతవరకైనా పరిగణలోకి తీసుకోవాలని..గోరంట్ల మాధవ్ వంటి గోముఖ వ్యాఘ్రాలను ప్రజాజీవితంలోకి రానీయకుండా కట్టడి చేయాలన్నారు.

## రేషన్ పంపిణీ పారదర్శకంగా చేపట్టాలి



**కోవూరు, ఆగస్టు 9 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ఎండీయూ డ్రైవర్లు రేషన్ డీలర్లు పంపిణీని పారదర్శకంగా చేపట్టాలని సీఎస్‌డీటీ కృష్ణప్రసాద్ అన్నారు. కోవూరులోని హాలు వీధి ప్రాంతంలో వాహనం ద్వారా కార్డుదారులకు పంపిణీ చేస్తున్న కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. తప్పనిసరిగా వేళలు పాటించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

## ఎంపి గోరంట్ల మాధవ్ కమ్మ జాతికి క్షమాపణ చెప్పాలి

**కావలి, ఆగస్టు 9 ప్రభాతవార్త :**ఎంపి గోరంట్ల మాధవ్ కమ్మ జాతికి వెంటనే క్షమాపణ చెప్పాలని కావలి కమ్మ సేవా సమితి నేతలు డిమాండ్ చేశారు. ఇటీవల అనంతపురంలో గోరంట్ల మాధవ్ నగ్న విశ్వరూపంతో ఒక వీడియో బయటకు వచ్చిందని, దీనిపై కమ్మ కులంపై చేసిన వ్యాఖ్యలు కులస్తుల్ని తీవ్రంగా బాధించాయని తెలిపారు. కావలి కమ్మ సేవా సమితి నేతలు మాకినేని మాల్యాద్రినాయుడు, బొట్లగుంట కొండపనాయుడు, రమేష్ చౌదరి, రావెళ్ళ నాయుడు, గడ్డం శ్రీనివాసులు, మామిళ్ళపల్లి ఆంజనేయులనాయుడులు మంగళవారం హెచ్చరికలు చేస్తూ ప్రకటన విడుదల చేశారు. కమ్మ కులం ఎవరి జోలికి వెళ్లదని, మా జోలికి వస్తే వదిలి పెట్టేది లేదని హెచ్చరించారు. నాలుగు రాష్ట్రాలలో కమ్మ జాతి విస్తరించిందని తెలిపారు. ప్రతి రాజకీయ పార్టీ గుర్తు పెట్టుకోవాలని తెలిపారు. కమ్మ కులం అన్ని రంగాలలో ముందుందని తెలిపారు. వైసిపి పాలనలో కమ్మ కులస్తుల్ని చులకనగా చూడడం తగదని హెచ్చరించారు. గోరంట్ల మాధవ్‌ను పదవి నుంచి వెంటనే తప్పించాలని డిమాండ్ చేశారు. కమ్మ కులానికి క్షమాపణ చెప్పకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేసి కమ్మ శక్తిని ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు.

## కౌన్సిలర్ షకిలాబేగంను పరామర్శించిన చైర్‌పర్సన్



**బుచ్చి ఆగష్టు 9 ప్రభాతవార్త:** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీ 7 వవార్డు కౌన్సిలర్ షేక్ షకిలాబేగంను చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ పరామర్శించారు. ఇటీవల ఆమె అనారోగ్యానికి గురికాగా విషయం తెలుసుకున్న చైర్‌పర్సన్ షకిలాబేగం ఇంటికి వెల్లి పరామర్శించారు.ఈ కార్యక్రమంలో ఆమె వెంట కౌన్సిలర్లు కె యానాదిరెడ్డి,రాచూరు సత్యనారాయణ, బిట్రగుంట సురేష్ , వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గోన్నారు.

## జగన్‌రెడ్డి పాలనలో గిరిజనులపై దారుణాలు



**కావలి, ఆగస్టు 9 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌రెడ్డి పాలనలో గిరిజనులపై అత్యాచారాలు, దాడులు, మారణకాండలు జరుగుతున్నాయని తెలుగుదేశం పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మంగళవారం కావలి షాదీమంజిల్‌లో ఆంధ్రప్రదేశ్ ఎరుకుల గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మొగిలి కల్లయ్య ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాలేపాటి ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. తమ బ్రతుకులు మారుతాయన్న ఆశతో బలహీన వర్గాలు కీలక పాత్ర పోషించి జగన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేశారన్నారు. ఫలితంగా గిరిజనులు అన్యాయానికి గురయ్యారన్నారు. మన కళ్ల ముందే వేలాది మంది గిరిజనులపై దాడులు, ఆడబిడ్డలపై అత్యాచారాలు జరిగాయన్నారు. దీనికి మూల్యం జగన్‌రెడ్డి చెల్లించుకోవాలన్నారు. గిరిజనులకు అందాల్సిన నిధుల్ని దారి మళ్లించారన్నారు. నవరత్నాల పేరుతో మోసగించడమే కాకుండా గిరిజనులను మానసికంగా కృంగదీశారన్నారు. రానున్న ఎన్నికలలో బలహీనవర్గాల వారు జగన్‌రెడ్డిని ఇంటికి పంపి తెలుగుదేశం పార్టీకి పట్టంకట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు మొగిలి కల్లయ్య మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మాలేపాటి సుబ్బానాయుడు రావడం మనందరి అదృష్టమన్నారు. గిరిజనులు బాగు పడాలంటే తెలుగుదేశం పార్టీ మళ్లి అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. కావలి నియోజకవర్గ టిడిపి అభ్యర్థిగా మాలేపాటిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు బోగిరి ప్రభాకర్, పేరం రవిబాబు, పోలా వెంకట రమణ, మొగిలి విజయ్‌కుమార్, నరసింహారావు, రావూరి రాధమ్మ, నరసింహులు, ఝాన్సీరాణి, పాలకీర్తి వసంతమ్మ, చలంచర్ల రాజా, పోట్లూరి వెంకటేశ్వర్లు, ఆవుల సురేష్, మొగిలి సుబ్రమణ్యం, గణపతి, రావూరి రామచంద్రయ్య, టిడిపి నేతలు గుత్తికొండ కిషోర్‌బాబు, జ్యోతిబాబురావు, ఏగూరి చంద్రశేఖర్, షేక్ మస్తాన్, చిత్తాబత్తిన మాల్యాద్రి, అక్కిలిగుంట సూర్యప్రకాష్, ఉప్పాల మాలకొండయ్య, హరిబాబు, శివకుమార్, శ్రీనివాసులు, గొట్టిపాటి రాము, నన్నే సాహెబ్, నారాయణ, వేణు, గిరిజన కుల సంఘాల నేతలు, గిరిజనులు పాల్గొన్నారు. మాలేపాటిని ఘనంగా సత్కరించారు. గిరిజనులతో కలిసి మాలేపాటి భోజనం చేశారు.

## సమరతసేవా పౌండేషన్ నూతన కమిటి ఎంపిక

**కొండాపురం,ఆగస్టు9,ప్రభాతవార్త:** కొండాపురం మండలం సమరతసేవా పౌండేషన్ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందని మాలేపాటి.మల్లికార్జున తెలిపారు.ఈకార్యక్రమానికి ముఖ్యఅతిదిగా కలిగిరి,కొండాపురం,జలదంకి మండలాలకు సంబందిని ధర్మప్రచారక్ సభ్యులు భాస్కర్ విచ్చేసి మాట్లాడుతూ ఈనూతన కమిటీ ద్వారా ప్రతి గ్రామంలో తరిగి ఆగ్రామాలలో వున్న దేవాలయాలలో ప్రతిరోజూ దీపారాధన వారం,వారం భజనకార్యక్రమాలు,సామూహిక హారతులు జరిగేవిదంగా కమిటి కృషిచేస్తుం దన్నారు. 12వతేదీన రాఖీ పౌర్ణమి సందర్భంగా అన్న, చెల్లెమ్మలకు రాఖీల వితరణ కార్యక్రమాలు చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు.ఈకమిటీలో కొండాపురం మండల కన్వీనర్‌గా చిమ్మిలి.రాంబాబు,సహ కన్వీనర్‌గా సోమినేని.రవీంద్ర మండల సలహాదారులుగా సుబ్బారావును ఎన్నుకోవడం జరిగిందన్నారు.ఈకార్యక్రమంలో తాళ్ళపాళెం.చంద్ర,సమరతసేవా పౌండేషన్ మండల మహిళా కన్వీనర్ మల్లేశ్వరమ్మ,మాతాజీశ్రీ వల్లి,అయితా.రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## జ్వరాల గుప్పెట్లో ఉలవపాడు మండలం

**నెల్లూరు,ఆగస్టు9,ప్రభాతవార్త:**ఉలవపాడు మండలాన్ని జర్వాలు పట్టి పీడిస్తున్నాయి.ఊరూరా టైఫాయిడ్,మలేరియా జ్వరాలు చెలరేగుతున్నాయి.మండలంలో జ్వరపీడికలు లేని గ్రామంమే లేకుండా పోయింది.ప్రతీ ఏటా ఆగస్టు-జనవరి మధ్య సీజనల్ వ్యాధులు చలరేగడం సాధారణమే.ఈ సారి కూడా జ్వరాలు అలాగే చెలరేగడంతో అన్ని ఆసుపత్రులు జర్వపీడితులతోనిండిపోతున్నాయి.ఉలవపాడులోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోజుకు 50మంది వరకు చికిత్స కోసం వస్తున్నారు.కరేడు,చాకిచెర్లలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సైతం నిండిపోయింది.ఇక మండలంలోని ప్రైవేటు ఆసుపత్రులతో పాటు ఆర్‌ఎంపి చికిత్స కేంద్రాలు సైతం జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయి.ఈ ఆర్‌ఎంపి కేంద్రాలు రోగుల నుండి అందినకాడికి దోచుకుంటున్నారు.జర్వం పేరుతో బి కాంప్లెక్స్ ఇంజక్షన్లు ఇచ్చి సాధ్యమైనంత ఎక్కువ డబ్బును దండుకుంటున్నారు.జ్వరాలు త్వరగా తగ్గించడం కోసం ఈ ఇంజక్షన్లు వాడుతున్నామని ఆర్‌ఎంపిలు చెబుతున్నారు.పారిశుధ్యం సక్రమంగా ఉంటే ఈ జ్వరాలు కొంతవరకు నియంత్రించవచ్చు.కానీ మండలంలోనిగ్రామపంచాయతీ పారిశుధ్యాన్ని సక్రమంగా పట్టించుకోవడంలేదు.గ్రామ పంచాయతీలో కార్యదర్శులు నివాసంఉండటంలేదు.ఎక్కడో దూరంగా ఉంటూ గ్రామపంచాయతీలకు వచ్చి వెళ్తున్నారు.

## టీచర్ డేవిడ్ మృతి-సంతాపం



**వలేటివారిపాలెం ఆగస్టు 9, ప్రభాతవార్త:** మ ండలంలోని గాంధినగర్‌లో టీచరుగా పనిచేస్తున్న కె.డెవిడ్ (42) మంగళవారం గుండెపోటుతో మృతిచెందారు.గత రెండు రోజులు క్రితం ఈయనకు గుండెనొప్పిరావడంతో కందుకూరులోని ప్రైవేటు వైద్యశాలను సంప్రదించారు. వారి సలహామేరకు మెరుగైన వైద్యచికిత్సకోసం విజయవాడలోని రమేష్ హాస్పటల్‌లో చేర్చారు.అయినా పలితం లేదు. మృతి చెందారు.దీంతో మృతుని బార్య ఇందిర, ఇద్దరు కుమారులు శోకసముద్రంలో మునిగిపోయారు.మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన బందుమిత్రులతోపాటు సీనియర్ జర్నలిస్ట్ రమణయ్య,ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, అలంకారం విజయకుమార్,టీడీపీ యూత్ అధ్యక్షుడు బద్ధిపూడి శిఖామణి,యలమందల మహేష్, అడ్వకేట్స్ కె.ఆంజనేయులు, పెగడా శ్రీనివాసులు యలమందల మహేష్ తదితరులు ఆకాంక్షించారు.మృతుని కుటుంబసభ్యులకు తమ తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.బౌతికకాయంను మృతుని స్వగ్రామం అమ్మపాలెంలో బందుమిత్రులు సందర్శనార్థం బుధవారం అందుబాటులో ఉంటుందని బందువులు తెలిపారు.

## కందుకూరు-కలిగిరి బస్సుల వేళల్లో స్వల్పమార్పు
## సిబ్బంది, ప్రయాణికుల్లో ఆవేదన



**వలేటివారిపాలెం ఆగస్టు 9, ప్రభాతవార్త:** ప్రయాణికుల సౌకర్యార్థం కందుకూరు-కలిగిరి బస్సు సర్వీసు వేళల్లో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నట్లు కందుకూరు డిపో మేనేజర్ కె.పెద్దన్నశెట్టి తెలిపారు. గతంలో కందుకూరు నుంచి కొండాపురం మీదుగా కలిగిరికి రోజుకు 11 ట్రిప్పులు బస్సు సౌకర్యం ఉండేదన్నారు.అయితే ప్రస్తుతం సాయంకాలం వేళల్లో కొండాపురం నుంచి కలిగిరికి ప్రయాణికులకు బస్సుసౌకర్యం అవసరం లేనందున మూడు ట్రిప్పులు రద్దుచేసినట్లు తెలిపారు.అయితే కందుకూరు నుంచి కొండాపురంకు మాత్రం యధావిధిగా 11 ట్రిప్పులను కొనసాగిస్తున్నట్లు వివరించారు.ఇందుకు సహకరించాల్సిందిగా డిపో మేనేజర్ ప్రయాణికులుకు విజ్ఞప్తిచేశారు. తాజాగా సవరించిన సమయం ప్రకారం కందుకూరులో కొండాపురం మీదుగా కలిగిరి వెళ్లడానికి 5.30. ,6.30., 10.30. ,11.30. ,15.30. ,16.30.గంటలకు,అదేవిధంగా కలిగిరిలో 8.00,9.00.,13.00., 14.00.,18.00,18.45 గంటలకు బస్సులు బయలుదేరతాయని సీఐ శ్యాంప్రసాద్‌తో కలిసి డిఎం మంగళవారం ప్రభాతవార్తకు వివరించారు. ప్రయాణికులు ఆవేదన:గతంలో ఉదయం 7.00 నుంచి 7.30గంటల సమయంలో కందుకూరు నుంచి కొండాపురం వైపు వెళ్లడానికి బస్సు సౌకర్యం ఉండేది.దీనివలన లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాలకు సంబందించిన టీచర్లు ఇతరత్రా ఉద్యోగులు కందుకూరు నుంచి డ్యూటీలకు వెళ్లడానికి సౌకర్యంగా ఉండేది.ప్రస్తుతం దీనిని రద్దు చేసి,9గంటలకు పెట్టారు. దీంతో ఉదయం 6.30నుంచి 9గంటల వరకు బస్సు సౌకర్యం లేదు.దీని వలన వీరంతా ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా కలిగిరి, కొండాపురం, లింగసముద్రం మండలాల నుంచి విద్యార్థులు పాఠశాలలకు, ప్రజలు వివిధపనుల నిమిత్తం కందుకూరు, లింగసముద్రం, కొండాపురం ప్రాంతాలకు రావడానికి 10గంటలలోపు బస్సుసౌకర్యం రద్దుచేయడం దారుణమని వివరిస్తున్నారు.కావున కలిగిరిలో ఉదయం 7.30, అదేవిధంగా కందుకూరులో ఉదయం 7గంటలకు బస్సులు బయలుదేరే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.లేకపోతే బస్సు ఉండి ఉపయోగం లేదని వాపోతున్నారు. ఈ విషయమై డీఎం మాట్లాడుతూ ప్రయాణికులు అవసరం నిమత్తం షెడ్యూలులో మార్పులు చేర్పులు ఉంటాయన్నారు. సిబ్బందిలో అలజడి: బస్సుల ప్రయాణ వేళల్లో చోటుచేసుకున్న మార్పుచేర్పుల వలన పలువురు సిబ్బందిలో అలజడి ఏర్పడింది.కొందరి స్వార్థంతో మేనేజ్‌మెంటు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆరోపించారు.సంబందిత సిబ్బందితో చర్చించకుండా ఈ నిర్ణయం తీసుకోవడం సమంజసం కాదని పలువురు అన్నారు. డ్యూటీలు వేయడంలోనూ,నిర్వహించడంలోనూ ఎదరయ్యే ఇబ్బందులు అదిగమించాల్సి ఉందన్నారు.ఈ విషయమై డీఎంతో చర్చించనున్నట్లు పలువురు ప్రభాతవార్తతో తెలిపారు. రోజుకు రూ.15లక్షలు ఆదాయం-డీఎం కందుకూరు డిపోలో 454మంది సిబ్బంది 100బస్సులు నిత్యం ప్రయాణికులుకు సేవలు అందిస్తున్నట్లు డిపో మేనేజర్ పెద్దన్న శెట్టి తెలిపారు.ఈ బస్సులు ప్రతిరోజూ 22రూట్‌లలో 42వేల కి.మీ.దూరం ప్రయాణం చేస్తూ 26వేలమందికి పైగా గమ్యస్థానాలకు చేరుస్తున్నట్లు ఆయన తెలిపారు.తద్వారా రోజుకి రూ.15లక్షలుకి పైగా ఆదాయం సమకూరుతున్నట్లు తెలిపారు.ఒంగోలు నడుస్తున్న నాన్‌స్టాప్ బస్ సర్వీసులను నిబందనలమేరకే నడపాలని డిఎం సిబ్బందికి సూచించారు. నిర్దేశిత ప్రాంతాలలోనే ఆపాలని, నిర్ణీత సమయాలలో గమ్యస్థానాలకు చేర్చాలని ఆయన సూచించారు.కందుకూరు నుంచి ఒంగోలుకు ప్రయాణికులు సౌకర్యార్థం 7నాన్‌స్టాప్, 6టూ స్టార్ సర్వీసులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికుల మనోభావాలకు భంగం కలగకుండా నిబందనల మేరకు ఈ సర్వీసులు నిర్వహించాలని ఆయన సూచించారు.

## బీటీఏ భవన నిర్మాణానికి ఉపాధ్యాయుల విరాళం

**కోవూరు, ఆగస్టు 9 ప్రభాతవార్త :** కోవూరు మండలం బహుజన టీచర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టనున్న భవన నిర్మాణానికి కోవూరుకు చెందిన వస్తీరాణి, ఏ. విజయమ్మలు చెరో 10 వేలను మంగళవారం అసోసియేషన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేణుగోపాల్, ఆదినారాయణ, జిల్లా గౌరవ అధ్యక్షులు చిన్నయ్య, ప్రధాన కార్యదర్శి రమేష్, తదితరులు ఉన్నారు.

## నాకు మీరు చేసిన సాయం మరువలేను



**నెల్లూరు ఆగస్టు 9, ప్రభాతవార్త-వైద్యం:** నా కుటుంబ కష్టకాలంలో తెలుగుదేశం పార్టీ అందించిన సాయాన్ని నేను బ్రతికిఉన్నంత వరకు మరువలేనని, నా పోరాటంలో టీడీపీ నేతలు అడుగడుగునా నాకు, నా బిడ్డలకి అండగా నిలిచారని (ఉదయగిరి.నారాయణ) భార్య ఉదయగిరి.పద్మ అన్నారు. మంగళవారం నగరంలోని మాగుంటలేఅవుట్‌లో ఉన్న తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద.రవిచంద్ర నివాసంలో ఆయనను పద్మ కలిసి ఆయనకు ధన్యవాధాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నా భర్త మృతికి కారకులైన వారిని టీడీపీ నేతల దృష్టికి తీసుకురావడంతో తమ కుటుంబానికి న్యాయం జరిగిందన్నారు. సోమిరెడ్డి.చంద్రమోహన్‌రెడ్డి, అబ్దుల్‌అజీజ్, జెన్ని.రమణయ్యలకు సదా ఋణపడి ఉంటానని ఆమె పేర్కొన్నారు. టీడీపీ నేతల అవిశ్రాంత పోరాటాలతోనే తనకు ప్రభుత్వం నుంచి 3 ఎకరాల భూమి, 18అంకణాల ఇంటి స్థలం, నెలవారి ఫించను, రూ.4లక్షల 10వేలు ఆర్థికసాయం అందాయని, పోలీసుల ఛార్జిషీట్ వేసిన అనంతరం మరో రూ.4లక్షల 10వేలు అందనున్నాయన్నారు. తన కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ప్రభుత్వంతో, పోలీసు అధికారులతో చేసిన పోరాట క్రమంలో టీడీపీ నేతల సహకారం ఎనలేదనిదన్నారు. ఈ కార్యక్రమంలో పద్మ కుటుంబసభ్యులతో పాటు జెన్ని.రమణయ్య ఉన్నారు.

## దేశంలోనే అత్యంత వైఫల్య ప్రభుత్వం వైసీపీదే

**కందుకూరుటౌన్,ఆగస్టు9,ప్రభాతవార్త:** దేశంలోనే అత్యంత వైఫల్యం చెందిన ప్రభుత్వం వైసీపీదేనని ఇంటూరి నాగేశ్వరరావు విమర్శించారు.మంగళవారం సాయంత్రం బాదుడే బాదుడు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని తూర్పు కమ్మపాలెం,బంగారమ్మగుడి,వడ్డెల పాలెం తదితర ప్రాంతాలలో ఆయన విస్తృతంగా పర్యటించారు.మాజీ శాసనసభ్యుడు దివి శివరాం కూడా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరె య్యారు.ఇంటూరి నాగేశ్వరరావు ఇంటింటికి తిరిగి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పరిపాలన జరగడంలేదని పేర్కొన్నారు.సంక్షేమాల పేరుతో దోచుకుంటున్నారని ఆరోపించారు.కందుకూరు పట్టణంలో రోడ్లు,డ్రైన్లు కూడా ఏర్పాటు చేయడంలో కూడా స్థానిక ప్రజా ప్రతినిధులు వైఫల్యం చెందారని పేర్కొన్నారు.నిత్యావసరాల ధరలు పెంచి సామాన్యులకు జీవనం కొనసాగించడం కష్టంగా మార్చారని ఇంటూరి ఆరోపించారు.దోచుకోవడమే పనిగా పెట్టుకుని కొండలను సైతం పిండి చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు.కందుకూరును నెల్లూరులో కలిపిన వైసీపినేతలు ఈ ప్రాంత ప్రజలకు ఏమి సమాదానం చెబుతారోనని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దివి శివరాంతోపాటు పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు,గోచిపాతల మోషే,బెజవాడ ప్రసాద్,వడ్డెల రవిచంద్ర,ఎస్‌కె రఫీ,సలాం,స్థానిక వార్డు నేతలు దివి శ్రీనివాసరావు,ఉన్నం కృష్ణ,రామా రావు,బెల్లం వెంకటేశ్వర్లు,దివి కోటేశ్వరరావు,దివి వెంకటేశ్వరరావు,రావి వెంకటేశ్వర్లు,సింగయ్య,మహిళా నేతలు కల్లూరి శైలజ,రాజ్యలక్ష్మి,ఆదెమ్మ,ఉమా,శ్రీలక్ష్మి హాజరైయ్యారు.కాగా ఇంటూరి నాగేశ్వరరావుకు ఈ వార్డు టిడిపి నేతలు ఘన స్వాగతం పలికారు.

## జగనన్న కాలనీలు త్వరితగతిన పూర్తి చేయాలి

**కందుకూరుటౌన్,ఆగస్టు9,ప్రభాతవార్త:** జగనన్న కాలనీల లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల పూర్తి చేయాలని ఆర్టీవో సుబ్బారెడ్డి అన్నారు.మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని దూబగుంట,ఆనందపురం,దివివారి పాలెం,కొండి కందుకూరు, జగనన్న ఇళ్ల కాలనీలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆర్డీవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ లబ్ధిదారులు త్వరగా తమ ఇళ్లను నిర్మించుకోవాలని కోరారు.ఇళ్లకు సంబంధించిన అన్ని వసతులను ప్రభుత్వం వారు ఏర్పాటు చేశారని అన్నారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సీతారామయ్య,మున్సిపాలిటీ కమీషనర్ మనోహర్,హౌసింగ్ డిఈ,ఏఈ,ఎంసి,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మొహరం వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రసన్న



**బుచ్చి ఆగష్టు 9 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగరపంచాయితీలోని స్థానిక ఖాజానగర్‌ల్లో మొహరం వేడుకలలో కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, నగరపాలక చైర్మన్ మోర్ల సుప్రజ, వవ్వేరు బ్యాంకు చైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డి వైస్ చైర్మన్ షేక్ షాహుల్ పీర్లను దర్శించుకున్నారు. కోఆప్షన్ మెంబర్ చిన్నల్లాబక్షు, కౌన్సిలర్ రహమత్‌భాషా, సర్దార్‌భాయి, ఉస్మాన్, గౌస్ మొహుద్దీన్ కమీటి మెంబర్లు నాయకులకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే పీర్లను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, పట్టణ అద్యక్షులు టంగుటూరు మల్లికార్జునరెడ్డి, మైనార్టీ నాయకులు పెద్దల్లాబక్షు, కె యానాదిరెడ్డి, కౌన్సిలర్ అనంతమ్మ, రాచూరు సత్యనారాయణ, బిట్రగుంట సురేష్, యూత్‌నాయకులు రేబాల సురేష్, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## కట్టుబడిపాళెంలో ఇండ్ల నిర్మాణాలు పరిశీలించిన కమీషనర్



**బుచ్చి ఆగష్టు 9 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలోని కట్టుబడిపాళెంలో సురేష్ కనస్ట్రక్షన్స్ ఆద్వర్యంలో నిర్మాణం చేస్తున్న పక్కాగృహాలను కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు.
ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, కోవూరు శాసనసభ్యులునల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ లేవుట్లలో పక్కాగృహ నిర్మాణాలు చేస్తున్నారనిఆయన పేర్కున్నారు. లబ్దిదారులకు ఎటువంటి శ్రమ లేకుండా ఇండ్ల నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. కట్టుబడిపాళెం లేవుట్‌లో సుమారు 100 ఇండ్ల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. నిర్మాణాలు పూర్తి చేసేందుకు సంబంధిత కాంట్రాక్టర్లను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పినట్లు ఆయన పేర్కున్నారు. ఈకార్యక్రమంలో యూత్‌నాయకులు చిరమన సురేష్ , మైనార్టీ నాయకులు ఇలియాజ్, తదితరులున్నారు.

## రొట్టెల పండుగకు పటిష్ట బందోబస్తు



**నెల్లూరుటౌన్, ఆగస్టు 09 ప్రభాతవార్త** రొట్టెల పండుగకు 2,173 మంది పోలీసు ఫోర్సుతో పటిష్ట బందోబస్తుత ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ సిహెచ్. విజయరావు వెల్లడించారు. నలుగు ఏఎస్‌పిలు, 12మంది డిఎస్పీలు, 37మంది సిఐలు, 140మంది ఎస్‌ఐలు, 364మంది ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుల్స్, 804మంది పోలీసు సిబ్బంది, 106 మంది మహిళ ఎఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసు కానిస్టేబుళ్లు, 110 మంది ట్రాఫిక్ పోలీసులు, 337మంది హోంగార్డులు, 56 హోంగార్డులు, 207మంది ఏఆర్, స్పెషల్ పార్టీ పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. బారా షాహీద్ దర్గా రొట్టెల పండుగ జరిగే తేదిలలో 9వ తేది నుంచి 13వ తేది వరకు పటిష్ట బందోబస్తు చర్యలు అమలు అవుతాయని ఎస్పీ తెలిపారు. మెయిన్ దర్గా, ఘూట్ ఏరియా, ట్రాఫిక్, పార్కింగ్ ఏరియా, సెక్టార్‌లుగా విభజించి సిబ్బందికి విధులను కేటాయించినట్లు ఎస్పీ తెలిపారు. 5రోజులు పాటు జరిగే ఈఉత్సవాలలో ప్రధానమైన గంధ మహోత్సవం నాడు విధులు పటిష్టంగా నిర్వహించాలని సిబ్బందికి ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. దర్గా ప్రవేశ ద్వారం, వెలుపలికి వచ్చే మార్గాలలో రద్దీకి తగ్గట్టుగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని క్రిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దర్గా పరిసర ప్రాంతాలు డ్రోన్, సిసి కెమారాల నిఘా నీడలో 24గంటల పాటు కంట్రోల్ రూం పర్యవేక్షణ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. రొట్టెల పండుగలో వాహనాల పార్కింగ్ అనేది కీలకం. బయట నుండి వచ్చే వాహనాలకు కేటాయించాలని పార్కింగ్ ప్రదేశాలలో మాత్రమే ఉంచాలన్నారు. 10డైవర్షన్ పాయింట్స్, 13మేజర్, 12 మైనర్ పార్కింగ్ ప్రదేశాలను, 14ట్రాఫిక్ జంక్షన్ పాయింట్‌లను 74 సాధారణ ట్రాఫిక్ రెగులేషన్ పాయింట్‌లను గుర్తించినల్లు తెలిపారు. కంటిన్జెంట్స్ ప్లాన్ క్యూఆర్‌టి టీంలను, రిజర్వు ఫోర్సు అన్ని వేళల అత్యవసర సంఘటనలు ఎదుర్కోవడానికి సిద్దంగా ఉంటాయన్నారు. సెంట్రల్ క్రైం స్టేషన్ ఇన్స్పెక్టర్ ఈఉత్సవాలలో జరిగే దొంగతనాలు, నేరాలను అరికట్టే క్రమంలో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో యాంటీ సబోటేజ్ చెకింగ్, ఆర్‌టపి లచే ముమ్మర తనిఖీలు ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు.

## ఐటిడిఎ ఆద్వర్యంలో నెల్లూరులో భారీ ర్యాలీ




**నెల్లూరుటౌన్, ఆగస్టు 9 ప్రభాతవార్త** ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నెల్లూరు నగరంలోని ఆంధ్రప్రదేశ్ సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ ఆద్వర్యంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీ కొండయ్యపాళెం గేటు సమీపంలోని ఐటిడిఏ కార్యాలయం నుండి ప్రారంభమై కిమ్స్ ఆసుపత్రి మీదుగా కెవిఆర్ పెట్రోల్ బంక్ వద్ద ఉన్న శ్రీవెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రం వరకు విజయవతంగా సాగింది. ఈసందర్భంగా నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గిరిజనాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. సమాజంలో గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధించి ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే ప్రతి ఒక్క గిరిజన కుటుంబం ప్రభుత్వ పథకాలను సక్రమంగా సది వినియోగం చేసుకున్నప్పుడే అది సాధ్యమవుతుందన్నారు. చాలా గిరిజన కుటుంబాలు అవగాహన లేక చిన్నచిన్న కారణాల వలన ఆధార్ కార్డులను తీసుకోలేక పోవడంతో, ఆయా కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందడం లేదన్నారు. తొలుత ఐటిడిఏ పి.ఓ డాక్టర మందా రాణి, జిల్లాలో సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ఆద్వర్యంలో గిరిజనుల అభవృద్ధి, సంక్షేమానికి చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను సవివరంగా తెలియజేశారు. అనంతరం స్వాతంత్ర సమరయోధులు కెవి. చలమయ్య దంపతులను, మరో స్వతంత్ర సమరయోధులు చల్లా గుర్నాధం తరుపున వారి కుటుంబ సభ్యులను వాలువాతో సత్కరించారు. గురుకుల, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు ప్రదర్కిశంచిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. తొలుత ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్య క్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ఆద్వర్యంలో ఐటిడిఏ కార్యాలయం నుండి శ్రీవెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రం వరకు జిల్లా అధికారులు, ఉదో ్యగులు, విద్యార్థులు జాతీయ జెండాతో పెద్ద ఎత్తున ర్యాలీని నిర్వహించారు. ఈర్యాలీలో జిలా ్ల పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జడ్పీ సిఇఒ వాణి, డిపిఒ ధనలక్ష్మీ, సెట్నెల్ సిఈఒ పులయ ్య, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఉషారాణి, సోషల్ వెల్ఫేర్ డిడి ఎం. రమాదేవి, ఐసిడిఎస్ పిడి టి. ఉమామహేశ్వరీ, జిల్లా బిసి వెల్ఫేర్ అదికారి పరిమళ, ఎపిఎంఐపిఒ కనకదుర్గా భవాని, అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బషీర్, వివిధ గిరిజన సంఘాల నాయకులు పెంచలయ్య, రామచంద్రయ్య, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, సంజీవయ్య, విద్యార్థులు, గిరిజన ప్రజలు పాల్గొన్నారు.

## జెఇఇ మెయిన్స్‌లో నారాయణ విద్యార్థుల ప్రభంజనం



**కావలి, ఆగస్టు 9 ప్రభాతవార్త** ఎన్‌టిఎ విడుదల చేసిన జెఇఇ మెయిన్స్ ఫలితాలలో నారాయణ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని కావలి కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. నాగిరెడ్డి, డీన్ కె. మహేష్‌లు తెలిపారు. ప్రతిభను చాటిచెప్పిన విద్యార్థుల్ని కళాశాలలో అభినందించారు. ఈ సందర్బంగా మాట్లాడారు. కొహత్ కెనార్ 8401 ర్యాంకు సాధించాడన్నారు. సి. హెచ్. మనోహర్‌రెడ్డి, ఎస్. డి. సైరుద్దీన్, బి. వినోదిని, కె. హర్షిత్‌తో పాటు 23 మంది విద్యార్థులు జెఇఇ అడ్వాన్స్‌కి అర్హత సాధించారన్నారు. జెఇఇ మెయిన్స్‌కి అర్హత సాధించిన విద్యార్థుల్ని, తల్లిదండ్రుల్ని, అధ్యాపకుల్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, నారాయణ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా వేణుగోపాలస్వామి బింబప్రతిష్ట మహోత్సవాలు



**జలదంకి, ఆగస్టు9, ప్రభాతవార్త:** జలదంకి జండాచెట్టు సమీపంలో నూతనంగా నిర్మితమైన శ్రీవేణుగోపాలస్వామి దేవాలయ బింబప్రతిష్ట, శిఖరప్రతిష్ట, మహాకుంభాభిషేక మహోత్సవాలలో భాగంగా రెండవరోజైన మండళవారం క్షీరాధివాసం తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదపండితులు పూజ్యం ఫణికుమార్, శివాచార్యుల వారి బృందం బ్రహ్మత్య ప్రతిష్టచేశారు. ఉదయం నుంచే భక్తులు ఆలయం వద్దకు తరలిరాగా నిత్యార్చన, నిత్యోపాసన, అస్రరాజార్చన, శాంతిమండపారాధన, క్షీరాదివాసం, పంచామృత వంటి కార్యక్రమాలు వేడుకగా జరిగాయి. సామంత్రం సాయంత్రోపాసన, శాంతికుంభావాహన, ప్రధానకలసస్తాపన, ఆదివాసహోమాలు జరిపించారు. తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. ఈసందర్బంగా యాదవ వీధిలో ఆద్యాత్మికశోభ సంతరించుకుంది. భక్తులు శ్రీకృష్ణ నామ స్మరణచేస్తూ స్వామివారికి కాయా, కర్పూరం సమర్పించారు. నూతన ఆలయ ఆసరిసర ప్రాంతాలలో విద్యుత్‌దీపకాంతులతో మిరుమిట్లు గొలిపాయి. రాత్రివేళ ఏర్పాటుచేసిన భజన, కోలాటం అందరిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈదైవకార్యక్రమాన్ని కనులారా తిలకించి తరించాలన్న తపనతో స్తానికులతోపాటు ఇతర గ్రామాలనుంచి అదికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గ్రామ విగ్రహోత్సవం సాంప్రదాయబద్దంగా నిర్వహించారు.

## పవిత్రంగా మొహరం వేడుకలు



**జలదంకి, ఆగస్టు9, ప్రభాతవార్త:** త్యాగానికి ప్రతీక అయినటువంటి మొహోరం పండుగను మండలకేంద్రమైన జలదంకిలో పవిత్రంగా నిర్వహించారు. మూడురోజులు పాటు సాంప్రదాయబద్దంగా సాగిన వేడుకలు మంగళవారంతో ముగిశాయి. చివరిరోజు మూజాబర్‌లు ఊదుపొగలు ఇచ్చిన అనంతరం ఏర్పాటుచేసిన అగ్నిగుండాన్ని పూడ్చారు. పీర్ల స్నానానికి బయలుదేరాయిపీర్లను ఎత్తుకున్న పిల్లలు లయబద్దంగా కదులుతుంటే డి. జె సౌండ్సు, డప్పువాయిద్యాల మద్య గ్రామ తూర్పు దొరువు వరకు ఉత్సవం సాగింది. దూలో అంటూ యువత దొరువులో స్నానాలు ఆచరించారు. కులమతాలకు అతీతంగా ఇతర మతాలవారు కూడా పాల్గొని సామర్యంగా మెలగడం విశేషం. అంతకుముందు మద్యాహ్నంవేళ అన్నదానం నిర్వహించారు. నిర్వాహకులుఎస్. ఎ అల్లాబాషా, ఖాజారహంతుల్లా, బాషాసాహేబ్, నాయబ్‌రసూల్, చిననాయబ్ తదితరులు దైవకార్యాన్ని ముందుండి నడిపించారు.

## వైభవంగా పీర్ల ఊరేగింపు



**కోవూరు, ఆగస్టు 9 ప్రభాతవార్త :** కోవూరులోని పీర్ల చావిడి వద్ద మంగళవారం తెల్లవారుజామున నిప్పుల గుండం తొక్కే కార్యక్రమాన్ని ముస్లిం యువత భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముస్లిం యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం కోవూరు పురవీధుల్లో పీర్లను ఊరేగించారు. ఈ సందర్బంగా భక్తులకు ప్రసాద కార్యక్రమాన్ని చేపట్టారు.

## ఖరీఫ్‌కు ఢోకా లేదు

అనంతసాగరం, ఆగస్ట్9, ప్రభాతవార్త: ఖరీఫ్ పంటకు ఢోకాలేదని తెలుగుగంగ సిఇ హరినారాయణరెడ్డి పేర్కొన్నారు. అనంతసాగరం మండలం సోమశిల జలాశయం నుండి కండలేరు రిజర్వాయర్‌కు ఎస్‌కెఎఫ్‌ఎఫ్ కెనాల ద్వారా మంగళవారం నీటిని విడుదల చేశారు. ఈసందర్బంగా గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహజంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సోమశిల జలాశయంలో 67టిఎంసిల నీటి నిల్వ ఉందని 20.900క్యూసెక్కుల వంతున నీరు జలాశయానికి వచ్చి చేరుతుందని కండలేరు రిజర్వాయర్ కు 30 టిఎంసిలు గా ఉందని, 60టిఎంసిల పూర్తి సామర్థ్యం తో ఉండేలా రోజుకు 10వేల క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తూ క్రమేపీ పెంచుతూ రోజుకు 1టిఎంసినీటిని విడుదల చేస్తామన్నారు. గత మూడు సంవత్సరాల నుంచి కండలేరు రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేస్తున్నామని ఇది నాలుగో సంవత్సరమన్నారు. 9లక్షల ఎకరాల ఖరీఫ్ పంటకు ఎటువంటి ఢోకా లేదన్నారు. ఈకార్యక్రమంలో ఎస్‌ఇ వెంకటరమణారెడ్డి, ఇఇ దశరధరామిరెడ్డి, జెఇ లు, ప్రాజెక్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

## నెలాఖరులోగా పెన్నాబ్యారేజి పనులు పూర్తి

**నెల్లూరురూరల్, ఆగష్టు9 ప్రభాతవార్త** పెన్నా బ్యారేజి పనులను నెలాఖరులోగా పూర్తిచేయాలని మాజీమంత్రి, సిటి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని పెన్నాబ్యారేజిని అధికారులతో కలసి సందర్శించారు. పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ, బ్యారేజి దాదాపుగా పూర్తయిందన్నారు. మిగిలిన పనులను ముమ్మరం చేయాలని కోరారు. నెలాఖరుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి చేతులమీదుగా పెన్నాబ్యారేజిని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో కార్పోరేటర్లు షేక్ అస్మ, గుంజి జయలక్ష్మి, ఆగ్రోడెరెక్టర్ కొణిదల సుధీర్ తదితర అధికారులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## త్వరలోనే నెల్లూరు-సంగం బ్యారేజీలను ప్రారంభిస్తాం



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 9 ప్రభాతవార్త** నెల్లూరు బ్యారేజీ నిర్మాణం పూర్తయిందని.. ఎన్నో సంవత్సరాలుగా పూర్తికాని బ్యారేజీని తాము ఇచ్చిన హామీ మేరకు పూర్తిచేశామని మాజీమంత్రి, నెల్లూరుసిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన నెల్లూరు బ్యారేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నెల్లూరు బ్యారేజీ-సంగం బ్యారేజీల నిర్మాణాలకు స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేయగా ఆయన మరణం తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వంగానీ ఆ తర్వాత వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వంగానీ పట్టించుకోలేదన్నారు. 2019లో తమ ప్రభుత్వం అధికారంలోకి రావడం, తనకు జలవనరులశాఖ అప్పజెప్పడంతో సంగం బ్యారేజీకు సంబంధించి వున్న కాంట్రాక్ట్ సమస్యలు పరిష్కరించడం, నెల్లూరు బ్యారేజీకి సంబందించి ఇబ్బందికరంగా వున్న టెండర్ల ప్రక్రియను రద్దు చేయడం, తిరిగి రూ. 95 కోట్లతో తిరిగి టెండర్లు పిలవడం జరిగిందన్నారు. ప్రస్తుతం నెల్లూరు బ్యారేజీ నిర్మాణం చిన్న చిన్న పనులు మినహా పూర్తయిందన్న ఎమ్మెల్యే పదిపదిహేను రోజుల్లోనే ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి చేతులు మీదుగా రెండు బ్యారేజీలను ప్రారంభింపజేస్తామన్నారు. తమ ప్రభుత్వం ముందు ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు ఐదుసార్లు జిల్లాకు వచ్చారని.. రెండుసార్లు నెల్లూరు బ్యారేజీని సందర్శించారన్న అనిల్‌కమార్‌యాదవ్ బ్యారేజీలను పూర్తిచేసేలా చర్యలు తీసుకోలేదన్నారు. తమ ముఖ్యమంత్రి రెండు బ్యారేజీల నిర్మాణాలను ప్రాధాన్యతగా తీసుకోవడంతోపాటు పూర్తిచేసి ప్రారంభించేస్థితికి తీసుకురావడం జరిగిందన్నారు. తాను మంత్రిగా పనిచేసినప్పుడే సంగం బ్యారేజ్ 80 శాతం, నెల్లూరు బ్యారేజ్ 90 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. నెల్లూరు, నెల్లూరురూరల్, సర్వేపల్లి, కోవూరు ప్రాంతాల రైతాంగానికి ఉపయోగపడేలా.. ముఖ్యంగా నెల్లూరుసిటీ భూగర్భజలాలు పెంచేందుకు దోహదపడే నెల్లూరు బ్యారేజ్‌ను ఈ నెలలోనే ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఇక ముఖ్యమంత్రి జిల్లాకు ఏమి చేశారని కొందరంటున్నారన్న మాజీమంత్రి నెల్లూరు, సంగం బ్యారేజీలతో పాటు సోమశిల-కండలేరు పనులకు 700 కోట్లు, సోమశిల-రాళ్ళపాడుకు రూ. 500 కోట్లు, నెల్లూరులో ఫ్లడ్‌బ్యాంక్, రీటైనింగ్‌వాల్‌లకు రూ. 300 కోట్లు, సోమశిల హైలెవల్‌కెనాల్-2, బండేపల్లి కాలువ ఇలా 2.500 కోట్ల రూ. 3 వేల కోట్ల రూపాయల వరకు జలవనరులశాఖ ద్వారా జిల్లాకు పనులిచ్చిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. ఫ్లడ్‌బ్యాంక్‌కు వారంలో శంకుస్థాపన చేయడం జరుగుతుందన్న ఆయన ఫ్లడ్‌బ్యాంక్, రీటెనింగ్‌వాల్స్ నిర్మాణాలు పూర్తయితే నెల్లూరు నగరానికి ఎటువంటి వరదల వల్ల ఇబ్బంది లేని పరిస్థితి ఏర్పడుతుందని అనిల్‌కుమార్‌యాదవ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కాగా మాజీమంత్రి వెంట ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర కమీషనర్ హరిత, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

## అబ్దుల్‌అజీజ్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఉదయగిరి పద్మ



**నెల్లూరు ఆగస్టు 9, ప్రభాతవార్త-వైద్యం** మీ మద్దతుతోనే నా కుటుంబానికి న్యాయం జరిగిందని కందమూరు గ్రామానికి చెందిన గతించిన ఉదయగిరి. నారాయణ భార్య ఉదయగిరి. పద్మ నెల్లూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జ్ అబ్దుల్‌అజీజ్‌ను మంగళవారం నగరంలోని హరనాథపురంలోని అజీజ్ నివాసంలో కలిసి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ తన భర్త విషయంలో జరిగిన అన్యాయానికి అండగా నిలబడి సోమిరెడ్డి. చంద్రమోహన్‌రెడ్డి, అబ్దుల్‌అజీజ్‌లు చేసిన సహాయం వలన మా కుటుంబం బాగుపడిందని ఆమె తెలిపారు. వీరు చేసిన పోరాటాలు, ఎనలేని కృషి ఫలితమే ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ యాక్ట్ కింద తమకు ప్రభుత్వం తరపున రావాల్సిన అన్ని సహాయాలు అందాయని పద్మ కొనియాడింది. అన్యాయం జరిగిన వారికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తుందని అబ్దుల్‌అజీజ్ పేర్కొన్నారు. ఉదయగిరి. నారాయణ భార్యకు న్యాయం చేసే విషయంలో సోమిరెడ్డి. చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా టీడీపీ నేతలందరూ ప్రధాన భూమికను పోషించారని, అందరి సమిష్టి కృషి వల్లే విజయం సాధించామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జన్ని. రమణయ్య, సాబిర్‌ఖాన్, కనపర్తి. గంగాధర్, శాంతినాయుడు పాల్గొన్నారు.

## గడగడపకు కార్యక్రమానికి విశేషస్పందన



**విడవలూరు ఆగష్టు 9 ప్రభాతవార్త** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలకు ప్రజలు విశేషంగా స్పందిస్తున్నారనిగడపగడపకు కార్యక్రమానికి విశేషస్పందన లభిస్తుందని కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రశంసించారు. రామచంద్రాపురం పంచాయితీలోని చంద్రశేఖరపురం, రవీంద్రపురం పొన్నపూడి, బుసగాడిపాలెం, ఎస్టీకాలనీ, లలో ఎమ్మేల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గడగడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార ్యక్రమంలో ప్రజలు ఆయనకు హారతులతో స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో భాగంగా ఎమ్మేల్యే ప్రజలను సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రశ్నించారు. అనంతరం ఆయన మాట్లాడుతు పొన్నపూడి గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన అన్నం శ్రీనివాసులు సుప్రజ, దేవిశ్రీ, ముగ్గురికి ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేశారని ఆయన తెలిపారు. మూడు సంవత్సరాలలో ఆకుటుంబానికి 11 లక్షల 80 వేలు లబ్ది చేకూరిందని అన్నారు. రామచంద్రాపురంలో టిడిపికి చెందిన వావిళ్ల రమణయ్య కుటుంబానికి మూడు సంవత్సరాలలో 2 లక్షలా 44 వేల రూపాయాలు లబ్ది చేకూరిందని స్పష్టం చేశారు. దీనిపైన చంద్రబాబు చెంచాలు కళ్ళు తెరవాలని అన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పడానికి ఇదే నిదర్శనమని చెప్పారు. ఈకార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ వీరిచలపతిరావు, జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ దొడ్డం రెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, తహసిల్దారు వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ చిరంజీవి, ఎస్ఐ బాబు, వైసిపి నాయకులు బెజవాద గోవర్ధన్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## దర్గాలో ఏర్పాట్లను సమీక్షించిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** బారాషహీద్ దర్గా ప్రాంగణంలో జరుగుతున్న రొట్టెల పండుగ ఏర్పాట్లపై నగరపాలక సంస్థ కమిషనర్ డి. హరిత అధికారులతో మంగళవారం సమీక్షించారు. దర్గా ప్రాంగణంలోని రిసెప్షన్ అండ్ మానిటరింగ్ సెంటర్‌లో డిప్యూటి కమిషనర్ చెన్నుడు, జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ పెంచలయ్య, నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి తదితర అధికారులతో సమీక్షించారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య కేంద్రాల నిర్వహణ, ఎమర్జెన్సీ విభాగాల పనితీరు, రెడ్‌క్రాస్ సేవలు, ఘాట్ వద్ద రొట్టెలు మార్చుకునేందుకు భక్తులకు అందుతున్న సౌకర్యాలు, స్నానాల గదులు, మరుగుదొడ్ల నిర్వహణను అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సమీక్షలో ఈఈ శేషగిరిరావు, స్థానిక కార్పొరేటర్ యాకసిరి వాసంతి తదితరులు పాల్గొన్నారు.